సాక్షి హనుమకొండ

శనివారం । 14 । జూన్ । 2025



ప్రాణం పోస్తున్నారు..

అత్యవసర సమయంలో రక్తదాతల నుంచి సేకరించిన రక్తంతో ఎంతోమంది పునర్జన్మ పొందారు. - 8లో▸



కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి– తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $33^{0}/26^{0}$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వేళ ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘పింగిళి’లో నాణ్యమైన విద్య



హన్మకొండ అర్బన్: వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తాజా మాజీ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శుక్రవారం ఉదయం పింగిళి కళాశాల 2025–26 అడ్మిషన్ల పోస్టర్‌ను కలెక్టర్ ప్రావీణ్య క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పింగిళి కళాశాలలోని సైన్స్, ఆర్ట్స్, కామర్స్ మొదలైన అన్ని విభాగాల్లో బోధనను అందిస్తున్న అధ్యాపకులకు అత్యధిక విద్యార్హతలు, దశాబ్దాల సుదీర్ఘ బోధనానుభవం ఉండడం వల్ల నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నారని తెలిపారు. అలాగే కళాశాలలో విద్యార్థినులకు కావాల్సిన అన్ని రకాల వసతులు, అత్యాధునిక బోధన ఉండడంతో విద్యార్థినులు చేరి తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, దోస్త్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ సురేశ్ బాబు, అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులపై టోల్ భారం

హన్మకొండ: ఆర్టీసీ ప్రయాణికులపై టోల్ భారం పెరిగింది. ఈనెల 8 నుంచి టోల్ గేట్ల వద్ద రేట్లు పెంచడంతో ఆమేరకు ఆర్టీసీ చార్జీలు పెంచింది. వరంగల్ రీజియన్ బస్సులు నడిచే రెండు రూట్లలో టోల్ గేట్లు ఉన్నాయి. హనుమకొండ – ఏటూరునాగారం రూట్‌లో ములుగు సమీపంలో, హనుమకొండ – హైదరాబాద్ రూట్‌లో రఘునాథపల్లి, బీబీనగర్ వద్ద టోల్ గేట్లు ఉన్నాయి. ఒక్కో టోల్ గేట్‌కు రూ.10 చొప్పున ఆర్టీసీ అదనంగా వసూలు చేస్తోంది. దీంతో ఇప్పటి వరకు ఉన్న చార్జీలపై ప్రతీ బస్సుకు హైదరాబాద్ రూట్‌లో రూ.20 చొప్పున, ఏటూరునాగారం రూట్‌లో రూ.10 చొప్పున, హనుమకొండ – జనగామకు రూ.10 చొప్పున, జనగామ – హైదరాబాద్ రూట్‌లో తిరిగే బస్సులకు రూ.10 చొప్పున ఆర్టీసీ చార్జీలు పెంచింది.

రేపు చేపూరి శ్రీరాం 29వ అష్టావధానం



విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అష్టావధాని చేపూరి శ్రీరాం 29వ అష్టావధానం ఈనెల 15న (ఆదివారం) ఉదయం పదిగంటలకు హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నారు. కాకతీయ పద్య కవితావేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. ముఖ్య అతిథిగా సహృదయ సాహితీ అధ్యక్షుడు గిరిజామనోహరబాబు, విశిష్ట అతిథిగా దహగాం సాంబమూర్తి, విశ్రాంత విద్యాశాఖ అధికారి రామేశ్వర రాజు పాల్గొంటారని నిర్వాహకులు కొండా యాదగిరి, వెలుగు ప్రభాకర్ తెలిపారు. అనంతరం పద్య కవి సమ్మేళనం నిర్వహిస్తారు.

హనుమకొండ డీఎండబ్ల్యూఓగా గౌస్ హైదర్!



న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి (డీఎండబ్ల్యూఓ)గా కేఏ.గౌస్ హైదర్‌ను ప్రభుత్వం నియమించనున్నట్లు సమాచారం. వరంగల్ జిల్లా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఫారిన్ సర్వీస్‌లో భాగంగా వ్యవసాయ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై మైనార్టీ సంక్షేమశాఖకు బదిలీ అయినట్లు తెలుస్తోంది. ఈమేరకు హనుమకొండ మైనార్టీ సంక్షేమాధికారిగా మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు, ఈమేరకు త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు హనుమకొండ డీఎండబ్ల్యూఓగా విధులు నిర్వర్తిస్తున్న డి.మురళీధర్‌రెడ్డి మే నెలాఖరున ఉద్యోగ విరమణ పొందడంతో డీఎండబ్ల్యూఓ పోస్టు ఖాళీ ఏర్పడింది.

తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతికి షోకాజ్ నోటీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.లింగయ్యకు రిజిస్ట్రార్ వి.రామచంద్రం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. లింగయ్య తన పట్ల అమర్యాదకరంగా మాట్లాడి అవమానపర్చారని తెలుగు విభాగం విశ్రాంత ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు ఈఏడాది ఏప్రిల్‌లో రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీస్‌లో రిజిస్ట్రార్ పేర్కొన్నారు. లింగయ్య ఇచ్చే వివరణను బట్టి ఆయనపై చర్యలు ఉంటాయని భావిస్తున్నారు.

‘ప్రీప్రైమరీ’లో ఆంగ్ల విద్య

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో యూకేజీ అడ్మిషన్లు

- హనుమకొండ జిల్లాలో 16.. వరంగల్ జిల్లాలో 13 పాఠశాలలు
- నాలుగేళ్లు నిండిన బాలలకు ప్రవేశాలు
- పాలెం ప్రభుత్వ పీఎస్‌లో 12మంది చిన్నారుల చేరిక
- ఎస్‌సీఈఆర్టీ నిపుణులతో సిలబస్ రూపకల్పన



హనుమకొండ పాలెం ప్రభుత్వ పీఎస్‌లో ప్రీప్రైమరీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ నెహ్రూనాయక్, ఉపాధ్యాయులు, చిన్నారులు పక్కన తల్లిదండ్రులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు మరో అడుగు ముందుకు పడింది. ఏళ్ల నుంచి ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ విద్య(ఇంగ్లిష్ మీడియం)ను ప్రవేశపెట్టింది. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ప్రవేశాలు ఉండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం కొనసాగిస్తున్నారు. ప్రీప్రైమరీ విద్యను ప్రవేశపెట్టడంతో విద్యార్థి ఆ పాఠశాలలోనే పూర్తిస్థాయి విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 210 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యకు ఈవిద్యాసంవత్సరం 2025–26 నుంచి అనుమతులిస్తూ ఇటీవల విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హనుమకొండ, వరంగల్ జిల్లాలో 29 స్కూళ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ జిల్లాలో 16, వరంగల్ జిల్లాలో 13 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ విద్యను ప్రవేశపెట్టారు. ఈమేరకు హైదరాబాద్ నుంచే ఎంపిక చేసిన పీఎస్‌ల, యూపీఎస్‌ల జాబితాలను ఆయా జిల్లాల విద్యాశాఖల అధికారులకు పంపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 31 పీఎస్‌లలో ప్రీప్రైమరీ విద్యను ప్రవేశపెట్టారు. మిగతా మూడు జిల్లాలు మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాలకు అవకాశం కల్పించలేదు.

12 మంది చేరిక

హనుమకొండ ములుగు రోడ్డులోని పెద్దమ్మగడ్డ ప్రాంతంలోని పాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీలో 12 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు చేర్పించారు. శుక్రవారం వీరికి ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యకమంలో ఎంఈఓ నెహ్రూనాయక్, గొల్లపెల్లి పీఎస్‌లో ఇద్దరు, రాంనగర్ పీఎస్‌లో ఇద్దరు చిన్నారులు ప్రీప్రైమరీ విద్యలో ప్రవేశాలు పొందారు. వీరికి కూడా టీచర్లు అక్షరాభ్యాసం చేయించారు.

ఈ స్కూళ్లలోనే ప్రీప్రైమరీ..

హనుమకొండ జిల్లాలో

ఎంపీపీఎస్‌లు: పరకాల, ఎంపీపీఎస్ సీతారాంపూర్, మాణిక్యాపూర్, కొప్పూరు, (ఎస్సీ కాలనీ) ముల్కనూరు, భావుపేట కేశ్వాపూర్. **ఎంపీయూఎస్‌లు:** మైలారం, ప్రగతి సింగారం, రతన్‌గిరి. **ప్రభుత్వ పీఎస్‌లు:** కాజీపేట, గొల్లపల్లి, పాలెం, రాంనగర్.

వరంగల్ జిల్లాలో..

ఎంపీపీఎస్‌లు: స్వామిరావుపల్లి, లక్కమారిపల్లి, తొగర్రాయి, రామతీర్థం, లింగాపురం, కొండూరు, కొత్తూరు, బుర్హాపల్లి, పైడిపల్లి, జీపీఎస్ శంభునిపేట. **ఎంపీయూపీఎస్‌లు:** రేకంపల్లి, లెంకాలపల్లి, గన్నారం పాఠశాలల్లో ప్రీప్రైమరీ విద్యను అందిస్తున్నారు.

యూకేజీ మాత్రమే..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ప్రీప్రైమరీ విద్యలో యూకేజీ విద్యార్థులు మాత్రమే ఉంటారని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా.. యూకేజీ విద్యార్థుల పాఠాలకు సిలబస్‌ను కూడా ఎస్‌సీఈఆర్‌టీ సబ్జెక్టు నిపుణులు రూపకల్పన చేసినట్లు సమాచారం. యూకేజీ చిన్నారుల కోసం పాఠ్య పుస్తకాలు సైతం ఉచితంగా అందజేయనున్నట్లు తెలిసింది. అదేవిధంగా ప్రీప్రైమరీలో చేరిన చిన్నారుల విద్యాబోధనకు ఒక్కో స్కూల్‌కు ఒక్కో వలంటీర్‌ను, చిన్నారుల ఆలనాపాలనా చూసేందుకు ఒక ఆయాను కూడా నియమిస్తారని తెలుస్తోంది. కాగా.. ఒక్కో స్కూల్ ప్రీప్రైమరీలో 30 మంది చిన్నారులకు ప్రవేశాలకు ఉండనుందని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది.

కళాకారులను ప్రోత్సహించాలి

- కేయూ విశ్రాంత ఆచార్యులు బన్న అయిలయ్య
- ప్రారంభమైన ఆహ్వాన నాటిక పోటీలు



మా ఇంట్లో మహాభారతం నాటకంలోని సన్నివేశం

హన్మకొండ కల్చరల్: కళాకారులను ప్రోత్సహించాలని, కళారంగాన్ని కాపాడుకోవాలని అందుకు కళాపోషకులు ముందుకు రావాలని కేయూ విశ్రాంత ఆచార్యులు ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే 16వ జాతీయస్థాయి నాటిక పోటీలు–2025 శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈమేరకు వరంగల్ పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో ఆచార్య బన్న అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి నాటక పోటీలు ప్రారంభించారు. అలాగే పారితోషిక దాతగా వ్యవహరించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులుగా కవి గిరిజామనోహరబాబు, బండారు ఉమామహేశ్వర్ రావు, వేదిక సలహాదారు సంజయ్‌బాబు, తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, మాడిశెట్టి రమేశ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం చిలుకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, నిజామాబాద్ తన్మయి ఆర్ట్స్ వారి చదువు నాటక ప్రదర్శనలు అలరించాయి.

బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షలకు చివరి అవకాశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి యూజీ, పీజీ, ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కోర్సులు (సెమిస్టర్ వైజ్) పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు కలిగిన విద్యార్థులు బ్యాక్‌లాగ్ పేపర్లను క్లియర్ చేసుకునేందుకు చివరి అవకాశం ఇస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యార్థులు థియరీ పేపర్లు, ప్రయోగ పరీక్షలు, ప్రాజెక్టు వర్క్, సెమినార్లు పూర్తి చేసుకోవచ్చునని కూడా తెలిపారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు కేయూ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడవచ్చని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసంతి
- సామూహిక అక్షరాభ్యాసం చేయించిన అధికారులు



చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈఓ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్



నడికూడలో సామూహిక అక్షరాభ్యాసం

పరకాల: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన, ప్రీప్రైమరీ విద్య అందిస్తున్నందున విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని డీఈఓ కె.వాసంతి కోరారు. కొత్త విద్యాసంవత్సరంలో బడిబాటలో భాగంగా పరకాలలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ వాసంతి, ఆర్డీఓ కె.నారాయణ, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్ చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీఈఓ వాసంతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నందున విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి అవసరమైతే దాతల సహాయం తీసుకోవాలని ఉపాధ్యాయులను, పాఠశాలల అభివృద్ధి కమిటీలను కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ రమాదేవి, మాజీ కౌన్సిలర్ ఉమాదేవి, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధు, కో–ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలి

నడికూడ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ వాసంతి అన్నారు. బడిబాటలో భాగంగా.. శుక్రవారం మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఓ వాసంతి పాల్గొని విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్స్, విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు పుట్టట్లేదని వేధింపులు.. వివాహిత ఆత్మహత్య

కమలాపూర్: పిల్లలు పుట్టడం లేదని అత్తింటి వారి వేధింపులు భరించలేక దార్ల రేణుశ్రీ (24) నీటి సంపులో పడి ఆత్మహత్య చేసుకుంది. కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన కుక్కల భద్రయ్య కూతురు రేణుశ్రీని సుమారు ఆరేళ్ల క్రితం కమలాపూర్‌కు చెందిన తన అక్క కుమారుడు దార్ల ఉదయ్‌కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి పిల్లలు పుట్టలేదు. ఉదయ్, అతడి తల్లి కోమల, తండ్రి అయిలయ్య పిల్లలు పుట్టడం లేదని తనను మానసికంగా వేధిస్తున్నారని, తనను చంపి ఉదయ్‌కి మరో పెళ్లి చేస్తామంటున్నారని రేణుశ్రీ తన తల్లిదండ్రులకు పలుమార్లు చెప్పుకుని రోదించింది. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం అత్తింటి వారి వేధింపులు భరించలేక రేణుశ్రీ ఇంటి ఆవరణలోని నీటి సంపులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి భద్రయ్య ఫిర్యాదు మేరకు దార్ల ఉదయ్, దార్ల కోమల, దార్ల అయిలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.



అమ్మవారి సన్నిధిలో కలెక్టర్ స్నేహ శబరీష్ కుటుంబ సభ్యులు

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ స్నేహ శబరీష్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా స్నేహ శబరీష్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్‌ను అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ ఓ వై.వి గణేశ్, డీఆర్డీఏ మేన శ్రీను, జెడ్పీ సీఈఓ విద్యాలత, అధికారులు పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు దేవాలయానికి వచ్చిన కలెక్టర్‌ను ఘనంగా స్వాగతించారు. కలెక్టర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కలెక్టర్‌తో పాటు ఆమె తల్లిదండ్రులు, కూతురు, కుమారుడు ఉన్నారు. పూజల అనంతరం అర్చకులు మహదాశీర్వచనం అందజేశారు. ఈఓ శేషు భారతి వారికి అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

వరంగల్ కలెక్టర్ సత్యశారద



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జిల్లా పరిషత్ సీఈఓ రాంరెడ్డి, మలేరియా అధికారి రజిని, డీబీసీడీఓ పుష్పలత తదితర అధికారులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు

జిల్లాల్లోని గిరిజన గ్రామాల్లో సౌకర్యాలు కల్పించడానికి ఈనెల 15 నుంచి 30 ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జనమన్) నిర్వహణపై అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గిరిజనులకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

‘గ్రేటర్’ గాడిన పడేనా..?

కొత్త కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కొరడా ఝుళిపించాల్సిందే..

- జీడబ్ల్యూఎంసీ, ‘కుడా’లలో ఇష్టారాజ్యం.. పలు విభాగాలపై అవినీతి ఆరోపణలు
- బల్దియాలో ఏళ్ల తరబడిగా అధికారుల తిష్ట
- ఎక్కడికి బదిలీ చేసినా పదోన్నతులపై ఇక్కడికే..



సాక్షిప్రతినిధి, వరంగల్:

బల్దియా కొత్త కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కి సొంత విభాగంలో పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు కలెక్టరేట్ల పరిధిలో విస్తరించి ఉన్న గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ), కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)ల ద్వారా అభివృద్ధి పనుల కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో కొన్ని విభాగాల్లో కోరలు చాస్తున్న అవినీతి, అక్రమాల వల్ల చెడ్డ పేరు వస్తోంది. పార్కులు, చెరువులు, నాలాల ఆక్రమణలు.. అక్రమ నిర్మాణాలు నగరంలో విచ్చలవిడిగా సాగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. భవన నిర్మాణదారుల సంఘం ఏకంగా సీఎం పేషీలోనే ఫిర్యాదు చేసింది. కార్పొరేషన్‌కు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధిని ఒప్పించి కాంట్రాక్టర్ల సిండికేట్‌కు ఎక్సెస్ టెండర్‌పై పనులు దక్కేలా ఇంజనీరింగ్ విభాగంలో కొందరు చక్రం తిప్పుతుండడం వివాదాస్పదమైంది. ఇదే సమయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తోపాటు ‘కుడా’ వైస్ చైర్మన్‌గా ఉన్న అశ్విని తానాజీ వాకడేపై బదిలీ వేటు పడడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్ బల్దియాపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే పాలన గాడిన పడుతుందన్న చర్చ సర్వత్రా జరుగుతోంది.

ఎక్కడికెళ్లినా తిరిగి ఇక్కడికే..

జీడబ్ల్యూఎంసీలో పని చేయడానికి అలవాటు పడిన అధికారులు ఎక్కడికి వెళ్లినా కొద్దిరోజులే. ఆరు నెలల నుంచి ఏడాది వ్యవధిలో మళ్లీ ‘బల్దియా’కే వస్తున్నారు. ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీలో ఓ విభాగానికి కీలకాధికారిగా ఉన్న ఒకరు అతడి పదవికి ముప్పు వస్తుందంటే చాలు.. పాదరసంలా పావులు కదుపుతారు. ఈ టాలెంట్‌తోనే 22 నెలల కిందటి వరకు ఏడాదికోసారి రెన్యువల్ చేయించుకుని నాలుగేళ్లు గడిపిన ఆయన.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొద్ది రోజులు పని చేశారు. పదోన్నతిపై ఆయన తిరిగి 2024 అక్టోబర్ చివరి వారంలో ‘రాజా’లా బల్దియాలోని కీలకపోస్టులో చేరారు.

- జూనియర్ అసిస్టెంట్‌గా చేరి ట్యాక్స్ ఆఫీసర్ స్థాయి వరకు ఎదిగిన మరో అధికారి సైతం ‘బల్దియా’ను వదల అన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ట్యాక్స్ ఆఫీసర్‌గా వర్ధన్నపేట మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి ఐదు రోజుల కిందటే మళ్లీ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలక పదవిలో చేరారు. వీరితోపాటు మరికొందరు ఇక్కడే తిష్టవేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవినీతి ఆరోపణల్లో పలు విభాగాలు..

ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ తదితర శాఖలపై అవినీతి ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఏకంగా మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారిని సైతం మెప్పించి పనులు కానిచ్చారన్న ఫిర్యాదులున్నాయి. వరంగల్ నగరం చుట్టూ విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లు, నాన్ లేఅవుట్ ప్లాట్లను ‘మామూలు’గా తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆరు నెలల వ్యవధిలో ఇంజనీరింగ్ విభాగం ద్వారా నిర్వహించిన సుమారు రూ.314 కోట్ల ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలోనూ కాంట్రాక్టర్లను మిలాఖత్ చేసి 4.99 శాతం ఎక్సెస్ టెండర్ పనులు దక్కేలా చక్రం తిప్పారన్న ఆరోపణలు ఉన్నాయి.

బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్ పాయ్



నగరాభివృద్ధికి సమష్టి కృషి చేద్దాం

అధికారులకు పిలుపునిచ్చిన కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

వరంగల్ అర్బన్: నగరాభివృద్ధికి అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పేయి పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌గా చాహత్ బాజ్‌పేయి ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేశారు. అనంతరం జరిగిన పరిచయ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని, కరీంనగర్‌లో మున్సిపల్ కమిషనర్‌గా కరీంనగర్ కార్పొరేషన్‌లో పనిచేసిన అనుభవం ఉందని మున్సిపల్ సర్వీసులపై అవగాహన ఉందని స్పష్టం చేశారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి నగర పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్‌లో అధిక ఫీజులను నియంత్రించాలి



వినతిపత్రం అందజేస్తున్న సురేష్, తదితరులు

విద్యారణ్యపురి: ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల భారాన్ని నియంత్రించాలని విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం పేదవర్గాల పిల్లలకు అడ్మిషన్లు కల్పించేలా చర్యలు చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ డీఈఓ వాసంతి, వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్‌కు శుక్రవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దాసు సురేష్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్డూ.. అదుపు లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ వంగ రవియాదవ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు హైమవతి, రవీందర్, అశోక్, కొడపాక దేవి, శ్రీరామోజు అంజలి, యోగేశ్వర్ పాల్గొన్నారు.

నూతన ఔషధ ఆవిష్కరణలు అవసరం

కేయూ క్యాంపస్: మానవాళికి ఉపయోగపడే నూతన ఔషధాల ఆవిష్కరణలు చేయాలని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'హ్యాండ్స్ ఆన్ మాలిక్యులర్ డాకింగ్ అండ్ డ్రగ్ డిస్కవరీ టెక్నిక్స్' అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే జాతీయ వర్క్‌షాప్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పరిశోధనారంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో నూతన ఔషధాలు ఆవిష్కరణలపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మాలిక్యులర్ డాకింగ్ మాన్యువల్‌ను వీసీ ఆవిష్కరించారు. వరంగల్ నిట్ బయో ఇన్ఫర్మెటిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పెరగు శ్యామ్, జువాలజీ విభాగం అధిపతి ఆచార్య షమిత, సైన్స్ డీన్ హనుమంతు, ప్రొఫెసర్లు ఇస్తారి, వెంకయ్య పాల్గొన్నారు.

వాహనం కొంటున్నానంటూ మోసం!

రామన్నపేట: వాహనం కొనుగోలు చేస్తున్నాను.. మీ సాక్షి సంతకం కావాలని పలువురి నుంచి పాన్, ఆధార్ కార్డులు సేకరించి వారి పేరుపైన వాహనాలు కొనుగోలు చేసి విక్రయించిన ఓ వ్యక్తిని శుక్రవారం మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవాడకు చెందిన బిట్ల సందీప్ దుస్తుల దుకాణం నిర్వహించి నష్టపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలని భావించాడు. ఈక్రమంలో తాను బైక్ కొనుగోలు చేస్తున్నానని.. సాక్షి సంతకం కోసం పాన్, ఆధార్ కార్డులు కావాలని ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద 10 మంది కార్డులు సేకరించి షో రూమ్‌ల నుంచి వివిధ ఫైనాన్స్‌ల వద్ద పది వాహనాలు కొనుగోలు చేశాడు. అనంతరం ఈ వాహనాలు దసరా ఆఫర్, దళిత బంధ్‌కు చెందినవిగా చెప్పి పలువురికి విక్రయించాడు. ఈఎంఐలు చెల్లించకపోవడంతో పాన్‌కార్డు, ఆధార్‌కార్డులు ఇచ్చిన వారికి మెస్సేజ్‌లు రావడంతో విషయం బహిర్గతమైంది. విచారణ చేసిన శుక్రవారం నిందితున్ని అరెస్టు చేసి 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



ప్రాణం పోస్తున్నారు..

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

- రక్తదానంలో యువత ముందంజ
- అవగాహన కల్పించడంలో ఎన్జీఓల కృషి
- అత్యవసర సమయంలో కాపాడుతున్న రక్తదాతలు



ప్రమాదం జరిగినప్పుడు.. అనారోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు రక్తం అందక అనేకమంది మృత్యుఒడికి చేరిన ఘటనలున్నాయి. కానీ ప్రస్తుతం ఎన్జీఓలు, యువజన సంఘాలు రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడం ద్వారా రక్తదానంపై వారిలోని అపోహలను దూరం చేస్తున్నారు. తద్వారా అనేకమంది యువత రక్తదానం చేసి చావుబతుకుల్లో ఉన్నవారికి ప్రాణం పోస్తున్నారు. ఈనేపథ్యంలో నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భం ప్రత్యేక కథనం.



భూపాలపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు(ఫైల్)

టేకుమట్ల: రక్తదానం చేయడం వల్ల నీరసించి ఆరోగ్య ఇబ్బందులు ఏర్పడతాయనే అపోహ ప్రజల్లో ఉంటుంది. కానీ, అలాంటిది జరగదు. కేవలం 21 రోజుల్లోనే పూర్తి స్థాయిలో రక్తం శరీరంలో సమకూరుతుంది. అలాగే 6 నుంచి 12 వారాల్లో పురుషులకు, 6 నుంచి 16 వారాల్లో మహిళలకు హిమోగ్లోబిన్ స్థాయిలు సమంగా చేరుకుంటాయి. ఈవిషయంపై వివిధ స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, రెడ్‌క్రాస్ వంటి సంస్థలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ రక్తదానం చేసేలా చొరవ చూపుతున్నాయి. దీంతో యువత రక్తదానం వైపు అడుగు వేస్తూ ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతున్నారు.

ఎవరు రక్తదానం చేయాలి..

ఎవరు రక్తదానం చేయాలనే విషయంపై ఎంతో మంది ఆలోచనలో పడి రక్తదానం చేయడంలో కాస్త వెనుకడుగేస్తున్నారు. 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలలోపు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు రక్తదానం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కానీ, హెపటైటిస్ బీ, హెచ్ఐవీ, రక్తహీనత, బలహీనత, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు.. రక్తదానం చేసేందుకు అనర్హులుగా వైద్యులు చెబుతారు.

ఎంతో మందికి పునర్జన్మ

అత్యవసర సమయంలో రక్తదాతల నుంచి సేకరించిన రక్తంతో ఎంతో మంది పునర్జన్మ పొందారు. కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో రక్త నిల్వలు లేక ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారు. అలాంటి పరిస్థితి రాకుండా రక్తదానం చేస్తూ ప్రాణాలను కాపాడాలని పలువురు మానవతావాదులు కోరుతున్నారు.

విలువైన ప్రాణాలను కాపాడొచ్చు..



ప్రతీ సంవత్సరం అక్టోబర్‌లో నిర్వహించే పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొంటాను. గ్రామాల్లోని యువతకు రక్తదానంపై అవగాహన కల్పించి ఎంతో మందిచే రక్తదానాన్ని చేయించాను. రక్తదానంపై అపోహలను నివృత్తి చేస్తూ ముందుకు సాగేలా కృషి చేశాను. భవిష్యత్‌లో కూడా యువతను రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తూ నేను చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను కాపాడొచ్చు.

\- దాసరి సుధాకర్, ఎస్సై, టేకుమట్ల

12 సార్లు రక్తదానం చేశాను..



విద్యార్థి దశ నుంచే రక్తదానం చేస్తున్నాను. నాతోపాటు నా మిత్రులచే రక్తదానం చేయిస్తున్నాను. ఇప్పటి వరకు 12 సార్లు రక్తదానం చేశాను. ఆపద సమయంలో రక్తదానం చేయడంద్వారా ప్రాణం పోసినట్టే అనే తృప్తి ఉంటుంది. భవిష్యత్‌లో కూడా రక్తదానం చేస్తాను.

\- సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి, రామకిష్టాపూర్(వి)

అపోహలు వీడాలి..



రక్తదానం చేయడం వల్ల నీరసించి అనారోగ్యబారిన పడతామనేది అపోహ మాత్రమే. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. మానవుని దేహంలోని ఎర్ర రక్త కణాలు ప్రతీ మూడు నెలలకొకసారి చనిపోతూ మళ్లీ కొత్తగా ఉత్పత్తి అవుతాయి. కావున రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారిని ఆదుకునే గొప్ప అవకాశం కలుగుతుంది.

\- డాక్టర్ ఆశాజ్యోతి, పీహెచ్‌సీ, వెలిశాల

మేనత్తను హతమార్చిన మేనల్లుడి అరెస్టు

- 170 గ్రాముల బంగారం, 34 గ్రాముల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ అంకిత్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్

వరంగల్ క్రైం: మద్యానికి అలవాటు పడి, జల్సాలకు అవసరమైన డబ్బు కోసం మేనత్తను హత్య చేసి ఒంటి మీద ఉన్న నగలను చోరీ చేసిన వరంగల్‌లోని మట్టెవాడ రాజీవ్‌కాలనీకి చెందిన రేకులపెల్లి ప్రణయ్‌ని గీసుగొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి పోలీసులు రూ.18 లక్షల విలువగల సుమారు 170 గ్రాముల బంగారు, 34 గ్రాముల వెండి అభరణాలతోపాటు రూ.10 వేలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన వరంగల్ జిల్లా గీసుగొండ మండలం స్థంభంపల్లి గ్రామానికి చెందిన కొచన స్వరూప (70)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈస్ట్‌జోన్ డీసీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన గీసుగొండ పోలీసులు టెక్నాలజీని వినియోగించి ప్రణయ్‌ని శుక్రవారం అరెస్టు చేసి గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో విచారించినట్లు తెలిపారు. ఈక్రమంలో ప్రణయ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జల్సాలు, బైక్ కొనుగోలుకు పెద్ద మొత్తంలో అప్పు చేసినట్లు తెలిపారు. ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ క్రమంలో స్థంభంపల్లిలో ఒంటరిగా ఉంటున్న తన మేనత్త స్వరూప వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని, ఆమెను చంపి డబ్బు, బంగారం దోచుకోవచ్చని ప్లాన్‌వేసినట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన తన మేనత్త స్వరూప వద్దకు వెళ్లిన ప్రణయ్ ఆమెతో కలిసి మద్యం సేవించిన అనంతరం మృతురాలి ఇంటిలోనే నిద్రించాడు. స్వరూప గాఢ నిద్రలో ఉన్న సమయంలో డంబెల్‌తో మేనత్త తలపై కొట్టినట్లు తెలిపారు. స్వరూప మరణించినట్లుగా నిర్ధారించుకుని ఒంటిపై ఉన్న బంగారు అభరణాలతోపాటు ఇంట్లోని వెండి ఆభరణాలు, డబ్బును దోచుకొని వెళ్లినట్లు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కాజీపేట జంక్షన్ మీదుగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్లపల్లి–తిరుపతి మధ్య 10 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా..

జూలై 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు చర్లపల్లి–తిరుపతి (07251) ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో జూలై 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుపతి–చర్లపల్లి (07252) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుటుంది. 1 ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ప్రయాణించే ఈ రైళ్ల సర్వీస్‌లకు అప్ అండ్ డౌన్ రూట్‌లో జనగామ, కాజీపేట, వరంగల్, నెక్కొండ, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, శ్రీ కాళహస్తి, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సంజీవ రెడ్డి. చిత్రంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరినట్లు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్–327 అధ్యక్షుడు జి.సంజీవ రెడ్డి, సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కను వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యలు చెప్పిన వెంటనే ట్రాన్స్ కో సీఎండీకి ఫోన్ చేసి త్వరలో విద్యుత్ ఉద్యోగ సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ మార్పు చేయడంతోపాటు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపచేయాలని, 01.02.1999 నుంచి 2004 వరకు ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ అందించాలని, విద్యుత్ సంస్థలో మిగిలివున్న 6,500 అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌లు, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని కోరినట్లు తెలిపారు. ఖాళీలను భర్తీ చేయాలని, ట్రాన్స్‌కో సీబీడీ గ్యాంగ్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు విద్యార్హతతో పనిలేకుండా గ్రేడ్–1 జీతం ఇవ్వాలని కోరామన్నారు. కారుణ్య నియామకాల వయస్సును 46 సంవత్సరాలకు పెంచాలని కోరినట్లు పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధికారుల డిప్యుటేషన్ రద్దు చేయాలి

- మంత్రి కొండా సురేఖకు ఉపేంద్ర శర్మ వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉపేంద్ర శర్మ, తదితరులు

హన్మకొండ కల్చరల్: దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారుల డిప్యుటేషన్ రద్దు చేసి ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ను జిల్లా దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది, జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉపేంద్ర శర్మ మాట్లాడారు. ఎండోమెంట్స్ కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై నియామకాలు చేపట్టాలన్నారు. దేవాదాయ శాఖలో అనేక ఖాళీలు ఉన్నాయని, ఉద్యోగుల పదోన్నతి కల్పించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ రామకృష్ణరావు, ఉపకమిషనర్లు సంధ్యారాణి, శ్రీకాంతరావు, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, ఈఓలు రత్నాకర్, శ్రీరాజేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం

- మూతపడిన మూడు పాఠశాలలు తెరుచుకున్నాయి



ఎర్రబెల్లితండా పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయురాలు

విద్యారణ్యపురి: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. హనుమకొండ డీఈఓ వాసంతి, జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి నడికుడ మండలం చర్లపల్లి, శాయంపేట పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యసంలో పాల్గొన్నారు. జిల్లాలో 16 ప్రాథమిక పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని వాసంతి తెలిపారు.

తెరుచుకున్న పాఠశాలలు

హనుమకొండ జిల్లాలో 41 పాఠశాలలు మూతపడగా బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ విద్యాసంవత్సరంలో టీచర్లు.. విద్యార్థులను చేర్చుకున్నారు. ఓగ్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా వచ్చిన విద్యార్థులకు టీచర్లు అక్షరాభ్యాసం చేయించారు. ఎర్రబెల్లి తండా ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ప్రవేశాలు పొందగా ఆ పాఠశాలను టీచర్ శ్రీదేవి తెరిచారు. ఎల్కతుర్తి మండలం ఎంపీపీఎస్ రామకృష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు పిల్లలు జాయిన్ కాగా వారికి టీచర్ అక్షరాభ్యాసం చేయించారు.

ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ విజేత నల్లగొండ





బాల్‌బాడ్మింటన్‌లో మొదటిస్థానంలో నిలిచిన వరంగల్ జట్టు, కబడ్డీలో రెండోస్థానంలో నిలిచిన జట్టు

- ద్వితీయ స్థానంలో వరంగల్
- బాల్ బ్యాడ్మింటన్‌లో వరంగల్ జట్టు విజేత

హన్మకొండ: తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ 2025–2026 శుక్రవారం ముగిసింది. బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్‌లో వరంగల్, మహబూబ్‌నగర్ జట్లు పోటీ పడగా, వరంగల్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల జట్టు విజేతగా నిలిచింది. మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ స్థానంలో, నల్లగొండ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ ఫైనల్‌లో నల్లగొండ, వరంగల్ జట్లు పోటీపడగా నల్లగొండ జట్టు విజేతగా నిలిచింది. వరంగల్ జట్టు ద్వితీయ స్థానం, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో కబడ్డీలో 12 జట్లు, బాల్ బ్యాడ్మింటన్‌లో 9 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లు బి.అశోక్ కుమార్, టి.మధుసూదన్, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, కన్వీనర్ ఎ.విజేందర్ రెడ్డి, సభ్యులు ఎండీ యాకూబ్ పాషా, సునీల్ కుమార్, ఇ.ప్రేమ్ కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, MCA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసీ, B.Sc (Agri), HPT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సంప్ర. 99481 31154. [SCA 25004771]

REAL ESTATE

TO-LET

■ 3 BHK ఫ్యామిలీ పోర్షన్ FCI కాలనీ, రోడ్ No.2, H.No.35-3-75, గోపాలపురం, హన్మకొండ. సెల్: 9866549297, 8712309298. [SCA25004457]

SERVICES

CHANGE OF NAME

■ I, SHAIK SHAKEEL AHMED (New Name), R/o H-No 33-6-295/1, Ganesh Nagar, Gavicherla x Road Rangashaipet, Khila Warangal Mandal, Warangal District, Pincode-506005, Telangana State, India. I have changed my Name From SHAIK SHAKEEL (Old Name) To SHAIK SHAKEEL AHMED (New Name) For all purposes. [SCA25004927]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

CHANGE OF NAME

■ I, BHUPATHI YUGANDHAR, S/o HEMA CHANDRA, Residing at H.No. 9-1-144, Girmajipet, Warangal (M), Warangal (Dist), Telangana State, India, I have changed my daughter's name from BHUPATHI TEZASRI (old name) to BHUPATHI SATYA SRI (new name) for all purposes. [WA-2281]

BUSINESS SERVICES

■ ITR / Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First. మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి: 7406393937 [IA-465]

■ మీ బంగారం ముణప్పురం, ముత్తూట్, మర్వాడి షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783417]

BUSINESS OFFER

■ Need Monthly Income? Get from your Own Forex Trading Account, Profit Sharing / Fixed Returns. Safe & Secure. Ph: 6301859174 [SCA25004901]

WANTED

■ Pharmacy Boys (Experienced), Lab Technicians (Experienced), Computer Operators & Supervisors. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, WGL. Timings: 12-00pm to 2-00pm. [WA-524]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పని చేయుటకు కార్ ఎలక్ట్రిషన్స్, సూ॥వైజర్స్ (F) & కార్ వాషింగ్ చేయుటకు (M/F) వర్కర్స్ కావలెను. 7995621165, 6303776310 [WA-30]

■ Hanamkonda A/C Hotel Waiters పనిచేయుటకు M/F కావలెను & ఆఫీస్‌లో స్టాఫ్ కావలెను. ఫోన్: 9848073605 [HA-12114]

FACULTY TEACHERS

■ Lady Principal with B.ed and Maths, Eng. Computer for Primary and all sub for Higher. Master's High School, Fort Warangal. Cell: 8790720106, 9347903778. [SCA25004915]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బీసీలకు ఉత్తుత్తి శాఖలా..?

- వద్దకొండ వేణుగోపాల్ గౌడ్

హన్మకొండ: రాష్ట్ర మంత్రివర్గంలో ఓసీలకు ఉత్తమ శాఖలను కేటాయించి, బీసీలకు ఉత్తిత్తి శాఖలను కేటాయించడం దేనికి నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం పాటిస్తామని చెప్పిన రాహుల్ గాంధీ మాటలకు విలువ లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర జనాభాలో 16 శాతం ఉన్న అగ్రవర్ణాలకు అత్యంత కీలకమైన బడ్జెట్ ఉన్న 7 మంత్రి పదవులను కేటాయించి, 86 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత లేని బడ్జెట్ లేని 8 మంత్రి పదవులను కేటాయించడం సామాజిక న్యాయమా అంటూ నిలదీశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. పాలనలో మాత్రం సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు.

పిడుగుపాటుతో కొబ్బరి చెట్టుపై మంటలు

- పలు ఇళ్లలో గృహోపకరణాలు దగ్ధం



కొబ్బరి చెట్టుపై చెలరేగుతున్న మంటలు

ఖిలా వరంగల్: నగరంలోని కరీమాబాద్‌లో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటలకు కురిసిన వర్షానికి ఉర్సు బొడ్రాయి శివాంజనేయ దేవాలయం వెనుక కుసుమ సుధాకర్, దయాకర్ ఇళ్ల ఆవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. కొబ్బరి చెట్టుపై పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఎగిసి పడుతున్న మంటలను స్థానికులు అదుపుచేశారు. పిడుగు పడే సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పిడుగు పడడంతో షార్ట్ సర్క్యూట్‌తో పలు ఇళ్లల్లో గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. ఎలక్ట్రానిక్ పరికరాలు ఖాళీపోయాయి. స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి ఘటనా స్థలాన్ని సందర్శించారు. పిడుగుపాటుతో నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

హౌరా రైలులోనుంచి పడి ల్యాబ్ టెక్నీషియన్ మృతి

- మృతుడిది సూర్యాపేట జిల్లా.. మంగళగిరి ఏయిమ్స్‌లో ఉద్యోగం



మృతిచెందిన శ్రావణ్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండ్యాల్–నష్కల్ రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం ఓ వ్యక్తి రైలులోనుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబల్ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుండెబోయిన గూడెం గ్రామానికి చెందిన సామంతపూడి శ్రవణ్‌కుమార్ (36) ఏపీ మంగళగిరిలోని ఏయిమ్స్‌లో ల్యాబ్ టెక్నీషీయన్‌గా పని చేస్తున్నాడు. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు జనరల్ టికెట్ తీసుకొని హౌరా (ఈస్ట్‌కోస్ట్) ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. పెండ్యాల్–నష్కల్ రైల్వే స్టేషన్‌ల మధ్యలో ప్రమాదవశాత్తు రైలులోనుంచి జారి పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బంధువులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజన్ విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. గతంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ నంబర్ల స్థానంలో టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఎయిర్‌టెల్ ఫోన్ నంబర్లు కేటాయించింది.

ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్

అధికారి హోదా	ఫోన్ నంబర్
ఎస్ఈ	87124 84950,
వరంగల్ టౌన్ డీఈ	87124 85067
వరంగల్ ఏడీఈ	87124 85048
ములుగు రోడ్ ఏడీఈ	87124 84977
శంభునిపేట ఏడీఈ	87124 85018
ఆజంజాహి మిల్ ఈఆర్ఓ ఏఏఈ	87124 85051
వరంగల్ ఈఆర్ఓ ఏఏఓ	87124 85052
వరంగల్ టౌన్ డివిజన్ కార్యాలయం ఏఈ టెక్	87124 85068
వరంగల్ టౌన్ డివిజన్ కార్యాలయం ఏఈ కమర్షియల్	87124 85056
స్టేషన్ రోడ్ ఏఈ	87124 85036
ఆజాంజాహి మిల్స్ ఏఈ	87124 85020
ఫోర్ట్ రోడ్ ఏఈ	8712485028
గొర్రెకుంట ఏఈ	87124 85033
మట్వాడ ఏఈ	87124 84963
ఆరెపల్లి ఏఈ	87124 84938
పోచమ్మ మైదాన్ ఏఈ	87124 84976
దేశాయిపేట ఏఈ	87124 84945
మామునూరు ఏఈ	87124 84998
శంభునిపేట ఏఈ	87124 85005
కరీమాబాద్ ఏఈ	87124 84986
స్టేషన్‌రోడ్ సబ్ స్టేషన్	87124 85046
స్టేషన్ రోడ్ సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85037
ఫోర్ట్ రోడ్ సబ్‌స్టేషన్	87124 85029

అధికారి హోదా	ఫోన్ నంబర్
ఆజాంజాహి మిల్స్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85022
గొర్రెకుంట సబ్‌స్టేషన్	87124 85035
ఫోర్ట్ రోడ్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85023
గొర్రెకుంట ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85030
మట్వాడ సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84965
ఆరెపల్లి సబ్‌స్టేషన్	87124 84940
ఆరెపల్లి సెక్షన్ కార్యాలయం ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84936
ఏనుమాముల సబ్‌స్టేషన్	87124 84941
పోచమ్మ మైదాన్ సబ్ స్టేషన్	87124 84972
పోచమ్మ మైదాన్ సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84976
దేశాయి సబ్ స్టేషన్	87124 84954
దేశాయిపేట సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84945
మామునూరు సబ్‌స్టేషన్	87124 85003
మామునూరు సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84997
బొల్లికుంట సబ్‌స్టేషన్	87124 85002
శంభునిపేట సబ్‌స్టేషన్	87124 85867
శంభునిపేట సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85006
కరీమాబాద్ సబ్‌స్టేషన్	87124 84990
కరీమాబాద్ సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84980